క్లుప్తంగా

సీఎం జగన్‌తోనే సంక్షేమం



మునగపాకలో ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేస్తున్న సచివాలయ కన్వీనర్ మహేష్

మునగపాక: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మునగపాక సచివాలయ కన్వీనర్ బొడ్డేడ మహేష్ అన్నారు. వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి మునగపాకలో గృహ సారథులు, వలంటీర్లతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు జనవరి 1 నుంచి రూ.3 వేలు పింఛన్ అందించనున్నట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరింత సంక్షేమం, అభివృద్ధి దక్కాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



అంబేద్కరిజం పునాది క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బొడ్డేడ ప్రసాద్

మునగపాక: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాకలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అంబేద్కరిజం పునాది అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం కోసం అంబేద్కర్ కృషి చేశారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కన్వీనర్ రాజాన బుజ్జిబాబు, మునగపాక, చూచుకొండ పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిలు కోనపల్లి రామ్మోహనరావు, పెంటకోట హరేరామ, దళిత నాయకులు గుంట్ల అప్పారావు, లంబా అప్పారావు, పిట్టా అప్పారావు, గంజి శ్రీనివాసరావు, కరణం గణేష్, మునగపాక ఉప సర్పంచ్ బొడ్డేడ అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నేతలు చదరం అప్పలనాయుడు, దొడ్డి బుజ్జి, రవీంద్ర, ఇల్లా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



బహుమతులు అందిస్తున్న హెచ్‌ఎం ధనుంజయ్

రాంబిల్లి: దివ్యాంగులు నిరాశ చెందకుండా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని రాంబిల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ధనుంజయ్ సూచించారు. రాంబిల్లి భవిత కేంద్రంలో శుక్రవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ లావణ్య, భవిత కేంద్రం ఉపాధ్యాయులు బుజ్జిబాబు, నాగరత్నం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బోధనా సామర్థ్యాలు మెరుగుపరచుకోవాలి



స్కూల్ కాంప్లెక్స్‌లో వివరాలు తెలుసుకుంటున్న ఎంఈవో-1 రామారావు

కోటవురట్ల: బోధనా సామర్థ్యాలను మెరుగుపరుచుకోవడం ద్వారా విద్యార్థుల నుంచి మంచి ఫలితాలను రాబట్టవచ్చని ఎంఈవో-1 రామారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఇంగ్లిష్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయులు నేర్చుకున్న అంశాలు, అనుభవాలను విద్యార్థులతో పంచుకోవడం ద్వారా అభ్యసనా సామర్థ్యాలు మెరుగవుతాయన్నారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ షేక్ అల్లావుద్దీన్, రిసోర్స్ పర్సన్స్ శ్రీనివాసరావు, జె.వి.ప్రసాదరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నా పేరు దుంగా చిట్టి. మాది రేవుపోలవరం గ్రామం. ఉషోదయ స్వయం సహాయక సంఘం సభ్యురాలిని. జగనన్న సీఎం అయ్యాక బీసీ కులస్తులమైన మాకు వైఎస్సార్ చేయూత పథకంలో లబ్ధి చేకూర్చారు. తొలి విడతలో రూ.18,750 నగదు బ్యాంకులో వేశారు. ఆ వెంటనే ఐకేపీ అధికారులు బ్యాంకు ద్వారా రూ.56,250 రుణం మంజూరు చేశారు. ఆ మొత్తంతో నేను పాన్‌షాప్ పెట్టుకున్నా. ఆ తర్వాత రెండు విడతల్లో వచ్చిన చేయూత నిధుల్ని బ్యాంకు రుణంలో జమ చేసుకుంది. ఇపుడు నాలుగో విడత జమ అయితే నా బ్యాంకు రుణం పూర్తిగా తీరిపోతుంది. నాలుగేళ్లుగా పాన్‌షాపు మా కుటుంబానికి ఉపాధిగా మారింది. మాలాంటి కుటుంబాలకు చేయూత బాగా ఉపయోగపడింది.




మండలంలోని గుర్రాజుపేటకు చెందిన బత్తిన అప్పలనర్స కూలీనాలీ చేసుకుని బతికేది. వ్యవసాయం ఉన్నపుడు మినహా మిగిలిన రోజుల్లో పనులుండేవి కావు. ఇందిరా వైష్ణవి ఎస్‌హెచ్‌జీలో సభ్యురాలు. వైఎస్సార్ చేయూత పథకంతో ఈమె జీవితమే మారిపోయింది. చేయూత పథకం, బ్యాంకు రుణం ద్వారా వచ్చిన మొత్తంతో గ్రామంలో కిరాణా దుకాణం ఏర్పాటు చేసుకుంది. నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన చేయూత నిధులతో ఆ రుణం చాలా వరకు తీరిపోయింది. కిరాణా దుకాణం నిర్వహణ, సరకుల కొనుగోలుపై నిర్వహించిన శిక్షణ శిబిరాలకు హాజరై మెలకువలు నేర్చుకుంది. ఇపుడు తమ కుటుంబానికి నమ్మకమైన ఉపాధి దొరికిందని, ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్తోంది.

అక్కచెల్లెళ్లకు జగనన్న చేయూత

బడుగు, బలహీన వర్గాల మహిళల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. మహిళలు ఆర్థికంగా కుటుంబానికి వెన్నుదన్నుగా నిలవాలని వైఎస్సార్ చేయూత పథకానికి శ్రీకారం చుట్టింది. 45-60 ఏళ్ల వయసున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఏడాదికి రూ.18,750 చొప్పున నాలుగేళ్లలో రూ.75 వేలు అందించనుంది. ఇప్పటికే మూడు విడతల్లో రూ.56,250ను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేసింది. నాలుగో విడత పంపిణీకి సిద్ధమయింది.

మండలంలో చేయూత వివరాలు

మొత్తం లబ్ధిదారులు	3,800 మంది
చిరు వ్యాపారులు	1,800 మంది
మూడేళ్లలో లబ్ధి	రూ.21.37 కోట్లు



- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఆర్థిక భరోసా
- మండలంలో 3,800 మందికి రూ.21.37 కోట్ల లబ్ధి

ఎస్.రాయవరం: వెనుకబడిన వర్గాలకు చెందిన మహిళలకు చేయూతనివ్వాలన్న దృఢ నిశ్చయంతో సీఎం జగన్ వైఎస్సార్ చేయూత పథకాన్ని అమలుచేశారు. ఈ పథకంతో మండలంలో 3,800 మంది లబ్ధి పొందారు. వీరిలో సుమారు 1,800 మంది సొంతంగా జీవనోపాధిని ఏర్పాటు చేసుకుని, తమ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. తొలి విడత రూ.18,750 అందుకున్నపుడే బ్యాంకుల ద్వారా మిగిలిన మూడు విడతల నిధులు రుణంగా పొందారు. ఈ మొత్తం రూ.75 వేలతో కిరాణా, ఫ్యాన్సీ తదితర చిరు వ్యాపారాలు, పాడి పశువులను కొనుగోలు చేసుకుని స్వయం ఉపాధి కల్పించుకున్నారు.

పాడె గేదెలతో ఉపాధి



వైఎస్సార్ చేయూతలో అందిన నగదు, బ్యాంకు రుణంతో రెండు పాడి గేదెలు కొనుక్కున్నాను. మా కుటుంబానికి ఇపుడివే జీవనాధారం. బ్యాంకు ద్వారా తీసుకున్న నగదు జగనన్న జమ చేసిన చేయూత నిధులతో చాలా వరకు తీరిపోయింది. ఈ గేదెలు మా కుటుంబానికి ఆస్తిగా మారాయి. మాలాంటి పేద కుటుంబాలకు జగనన్న చేయూత ఎంతగానో ఉపయోగపడింది. సీఎం జగన్ రుణం ఎప్పటికీ తీర్చుకోలేం.

– కిల్లాడి రమణమ్మ, పాడి రైతు, అమరావతి గ్రూప్

గీత కార్మికునికి నిత్యావసరాల పంపిణీ



బాధితుని తల్లికి నిత్యావసరాలు అందజేస్తున్న అండిబోయిన లక్ష్మి తదితరులు

పెదగంట్యాడ: ప్రమాదశాత్తూ చెట్టుపై నుంచి పడి మంచానికే పరిమితమైన కల్లుగీత కార్మికుడికి యాత కార్పొరేషన్ డైరెక్టర్ అండిబోయిన లక్ష్మి భరోసా ఇచ్చారు. ఆ కుటుంబానికి నిత్యావసర వస్తువులు అందించి ఉదారత చాటుకున్నారు. ఎస్.రాయవరం మండలం, కొరుప్రోలు గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు ముమ్మర్ల రాజు ఇటీవల కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తూ పడిపోయాడు. అతని వెన్నుపూస విరిగి, మంచానికే పరిమితం కావడంతో కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. బాధితుడి తల్లి కూలి పనులకెళ్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. దీనిపై సమాచారం అందుకున్న లక్ష్మి శుక్రవారం కొరుప్రోలులో బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందించారు. కార్యక్రమంలో అండిబోయిన అప్పారావు, వనుము నాగేశ్వరరావు, బత్తిన రాము, ఓడిబోయిన శంకర్, పెట్ల శ్రీను పాల్గొన్నారు.

తీర్థయాత్రలకు నగర సంకీర్తన బృందం



బస్సులో వెళ్తున్న నగర సంకీర్తన సభ్యులు

మునగపాక: మండలంలోని చూచుకొండకు చెందిన పలువురు భక్తులు శుక్రవారం తీర్థయాత్రలకు బస్సులో బయలుదేరారు. చూచుకొండ నగర సంకీర్తన బృందం సభ్యులు ధనుర్మాస వ్రతాన్ని ఆచరిస్తున్నారు. ధనుర్మాసం పూజల్లో భాగంగా శ్రీకాకుళంలోని అరసవెల్లి సూర్యనారాయణ దేవాలయం, శ్రీకూర్మం, విజయనగరంలోని రామతీర్థం తదితర పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు వెళ్లారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



హరిపాలెం హెచ్‌ఎంకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

అచ్యుతాపురం: మండలంలోని ఉన్నత పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. అచ్యుతాపురం, హరిపాలెం, కొండకర్ల, జగన్నాథపురం, పూడిమడక, ఖాజీపాలెం, పెదపాడు, మడుతూరు, దోసూరు ఉన్నత పాఠశాలల్లో ప్రస్తుతం టెన్త్ చదువుతున్న విద్యార్థులకు వీటిని అందించారు. కార్యక్రమంలో కె.మహిమారావు, జీఎస్ ప్రకాష్, ఎం.వెంకటఅప్పారావు, ఇ.అరుణ, నీరజ, పారిజాతం, ఝాన్సీ, రవివర్మ, సత్యనారాయణ, సలీమ్, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

తిరువీధుల్లో మెరిసిన దేవ దేవుడు




పుణ్యకోటి వాహనంలో స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి: ధనుర్మాస అధ్యయనోత్సవాల సందర్భంగా ఉపమాక వేంకటేశ్వర స్వామివారి సన్నిధిలో తిరువీధుల్లో దేవదేవునికి వాహన సేవలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. కొండ దిగువన ఉత్సవ మూర్తులకు, క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామికి, గోదాదేవి అమ్మవారికి నిత్యార్చనలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామివారిని పుణ్యకోటి వాహనంపై గోదాదేవిని పుష్పమాలలు, పట్టుపీతాంబరాలతో అలంకరించి పెద్ద పల్లకిలో ఉంచి తిరువీధి సేవలు నిర్వహించారు. అనంతరం గోదాదేవి సన్నిధిలో తిరుప్పావైలోని ఉంగళ్ పుళ్ళక్కడైత్తోట్టత్తు వావియుళ్ పద్నాలుగో పాశురాన్ని విన్నపం చేశారు. రాత్రి రాపత్తు అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వామివారిని శేషతల్ప వాహనంలో అధిష్ఠింప చేసి తిరువీధి సేవ చేశారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, గోపాలాచార్యులు, రాజగోపాలాచార్యులు పాల్గొన్నారు.

ఘనంగా సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం

అనకాపల్లి:స్థానిక గవరపాలెం శ్రీ సంతోషిమాత అమ్మవారి ఆలయ 47వ వార్షికోత్సవ కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వైఎస్సార్ సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని ఇంత ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. మహిళలు 24 గంటల ఏకాహం ప్రారంభించారు. జై సంతోషిమాత జై అంటూ భజన చేశారు. కార్యక్రమంలో 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీ సౌజన్య రాంబాబు, ఆలయ అర్చకులు సరిపల్లి కామేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పీఎస్‌కే నాయుడు, పెతకంశెట్టి శ్రీనివాస్, విల్లూరి ప్రసాద్, కాండ్రేగుల సాంబ, చదరం వెంకటరావు, కొణతాల లక్ష్మి, సంధ్య, దాడి లక్ష్మి, శ్రీదేవి పాల్గొన్నారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌తో వార్డు సభ్యుడి మృతి



ఎంఎస్ఎన్ మూర్తి(ఫైల్)

పాయకరావుపేట: పాయకరావుపేట పంచాయతీ 6వ వార్డు సభ్యుడు బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. వార్డు సభ్యుడు ఎంఎస్ఎన్ మూర్తి(బాబి)కి గురువారం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో తుని ఆస్పత్రిలో చేర్చారు. మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నంలోని ఆస్పత్రికి తరలించారు. విశాఖలో చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల పంచాయతీ పాలకవర్గం, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు వున్నారు.

కనకమహాలక్ష్మీ రావమ్మా... మా పూజలందుకోమ్మా

- 1,500 మంది మహిళలతో సామూహిక కుంకుమార్చన



సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

యలమంచిలి రూరల్: పట్టణంలోని ధర్మవరం కనక మహాలక్ష్మి ఆలయంలో మార్గశిర మాసం మూడో శుక్రవారం సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తులతో ఆలయం కిటకిటలాడింది. జేపీపాలెం సర్పంచ్ వజ్రపు శంకరరావు దంపతుల ఆధ్వర్యంలో రూ.3 లక్షలతో 1,500 మంది మహిళలకు జాకెట్లను, సామూహిక కుంకుమ పూజా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి నామంతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. అర్చకుడు కోటి పంతులు ఆధ్వర్యంలో అష్టోత్తర, సహస్ర నామార్చాన, శ్రీసూక్తం, దుర్గా సూక్తంతో పూజలు చేశారు. అనంతరం రెండు వేల మందికి అన్నప్రసాదాన్ని అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

ఉప విద్యాశాఖాధికారికి అభినందన సత్కారం



అప్పారావును సత్కరిస్తున్న మండల ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం: మండలంలో ఎంఈవో-1గా పని చేసిన పి.అప్పారావు పదోన్నతిపై యలమంచిలి ఉప విద్యాశాఖాధికారిగా రావడం ఆనందంగా ఉందని మండల ఉపాధ్యాయులు అన్నారు. పి.ధర్మవరం ఉన్నత పాఠశాలలో శుక్రవారం అప్పారావును ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అందించాల్సినవి సత్కారాలు కావని, తను ఈ బాధ్యతల్లో ఉన్నంత వరకు స్కూళ్లలో ఉత్తమ ఫలితాలు రాబట్టాలని కోరారు. ప్రభుత్వం అన్ని వసతులు కల్పించి విద్యా బోధనకు సహకరిస్తోందని, ఉపాధ్యాయులు కూడా నిత్యం విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్వీ రమణారావు, గార ప్రకాష్, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

పాండురంగ ఆలయంలో అన్న సమారాధన



అన్న సమారాధనకు హాజరైన భక్తులు

పాయకరావుపేట: పట్టణంలోని పురాతన శ్రీ రాధారుక్మిణీ సహిత పాండురంగ దేవస్థానంలో శుక్రవారం అన్న సమారాధన నిర్వహించారు. ధనుర్మాస పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆలయ అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. తుని, పాయకరావుపేటకు చెందిన వేలాది మంది భక్తులు అన్నసమారాధనకు హాజరై అన్నప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి నరిసే వెంకటాద్రి భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



బాలికోన్నత పాఠశాలలో నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పిస్తున్న బీబీజీ సంస్థ ప్రతినిధి



ఆసక్తిగా వింటున్న బాలికలు

యలమంచిలి రూరల్: విద్యార్థి దశ నుంచే బాలికలు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని బీబీజీ సంస్థ సీఎండీ మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో బాలికలకు చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాల అవసరాన్ని తెలిపేందుకు అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళా సాధికారతే లక్ష్యంగా తమ సంస్థ చేస్తున్న కృషిని వివరించారు. బీబీజీ బంగారుతల్లి పేరుతో నిర్వహించిన ఈ సమావేశంలో విద్యార్థినులకు భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లు, వాటిని ఎలా అధిగమించాలో వారి నుంచే ఆసక్తికర సమాధానాలు రాబట్టారు. భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవడానికి అవసరమైన ప్రశ్నావళిని బాలికలతో పూరించి, వారి ప్రతిభను అంచనా వేసి ధ్రువపత్రాలు అందించనున్నట్లు తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం వీవీ హిమబిందు మాట్లాడుతూ ఇలాంటి అవగాహన సమావేశాలను విద్యార్థినులు సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీబీజీ సాఫ్ట్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్ నిపుణులు లక్ష్మీశంకర్, సతీష్ కుమార్, ఉపాధ్యాయుడు పద్మకుమార్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా..



తోటాడ హైస్కూల్ ఆవరణలో కబడ్డీ ఆడుతున్న మహిళలు



పీఎల్ పురంలో వాలీబాల్ పోటీలకు సిద్ధంగా ఉన్న మహిళా జట్లు



తోటాడ హైస్కూల్‌లో కబడ్డీ ఆడుతున్న పురుషులు

మునగపాక: మండలంలోని తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం కబడ్డీ పోటీలను పురుషులకు, మహిళలకు వేర్వేరుగా నిర్వహించారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా పేర్లను నమోదు చేసుకున్న క్రీడాకారులు పోటీపడ్డారు. పురుషుల జట్లు 4, మహిళల జట్లు 2 ఈ పోటీల్లో పాల్గొన్నాయి. పోటీలను తిలకించేందుకు స్థానికులు ఉత్సాహంగా తరలివచ్చి, క్రీడాకారులను ప్రోత్సహించారు.

పాయకరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు పోటాపోటీగా జరుగుతున్నాయి. మండలంలోని 25 గ్రామ సచివాలయాల పరిధిలోను పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. శుక్రవారం అధిక సంఖ్యలో మహిళా టీమ్‌లు వాలీబాల్ పోటీల్లో చురుగ్గా పాల్గొన్నాయి. ఆయా గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో క్రీడలు ఉత్సాహంగా జరుగుతున్నట్లు ఎంపీడీవో ఎ.సాంబశివరావు తెలిపారు.

రాంబిల్లి: మండలంలో పలు గ్రామాల్లో శుక్రవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉల్లాసంగా జరిగాయి. గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల మహిళలు ఉత్సాహంగా ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్నారు. రాజుకోడూరు గ్రామంలో మహిళా సంఘాల సభ్యులు ఖోఖో ఆడారు. మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ పోటీలను పర్యవేక్షించి, దైనందిన జీవితంలో క్రీడల ప్రాధాన్యతను వివరించారు.

కోటవురట్ల: ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. గ్రామీణ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. కోటవురట్ల, పాములవాక గ్రామాల్లో శుక్రవారం క్రికెట్, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. పాములవాకలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు క్రీడాకారులను ప్రోత్సహించారు. కోటవురట్లలో మండల పరిషత్ ఏవో చంద్రశేఖర్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం పోటీలను పర్యవేక్షించారు. క్రీడా పోటీలకు యువత నుంచి మంచి స్పందన వస్తున్నట్టు ఏవో చంద్రశేఖర్ తెలిపారు.



గోపాలపట్నంలో వాలీబాల్ ఆడుతున్న మహిళలు



రాజుకోడూరులో ఖోఖో ఆడుతున్న మహిళలు



పాములవాకలో కబడ్డీ ఆడుతున్న బాలికలు

పశు వైద్య శిబిరానికి స్పందన



అరబుపాలెంలో పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

మునగపాక: మండలంలోని అరబుపాలెంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరానికి రైతుల నుంచి విశేష స్పందన వచ్చింది. రిలయన్స్ ఫౌండేషన్, పశు సంవర్ధక శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన శిబిరాన్ని సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు ప్రారంభించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ కార్య నిర్వహణాధికారి రామ్మోహనరావు, పశువైద్యాధికారులు భాను, పద్మజలు పశువులను తనిఖీ చేసి, ఉచితంగా మందులిచ్చారు. 40 పశువులకు గర్భకోశ చికిత్సలు, 15 లేగ దూడలకు నట్టల నివారణ మందులు అందించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ పశు పోషణలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పశువుల కొనుగోలులో రైతులకు 35 శాతం రాయితీపై రుణం అందిస్తున్నట్లు తెలిపారు. పశు పోషణలో ఎలాంటి సందేహాలున్నా 18004198800 నంబర్లో సంప్రదించాలన్నారు. విశాఖ డెయిరీ పాల సంఘం అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి రామచంద్రరావు, గోపాలమిత్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.